రేపు జగ్గంపేటలో జాబ్ మేళా

విశాలాంధ్ర - జగ్గంపేట : ఈ నెల 6వ తేదీ కాకినాడ వికాస అధ్వర్యంలో జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు టిడిపి కాకినాడ జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ కుమార్ ఒక ప్రకటలో తెలిపారు. ఆదివారం పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేశారు. జగ్గంపేట నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతి, యువకులకు మాత్రమే జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందన్నారు. వారు మాత్రమే హాజరై సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ జాబ్ మేళాలో వివిధ ప్రవేట్ కంపెనీలు పాల్గొంటున్నాయని టెన్త్, ఇంటర్, ఐటిఐ, డిగ్రీ చదువుకున్న 18 నుండి 35 సంవత్సరాలు వయస్సు ఉన్న హాజరు కావాలన్నారు. జగ్గంపేట నుండి గుర్రంపాలెం వెళ్ళే రోడ్డులో డాక్టర్ బుర్రి రాంబాబు అపార్ట్మెంట్స్ వద్ద ఈ జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఉదయం 9 గంటలకు జాబ్ మేళా కేంద్రం వద్దకు హాజరు కావాలని కోరారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

- **9.30.కి డయల్ యువర్ కమిషనర్**
- **సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ సూచన**

విశాలాంధ్ర - కాకినాడ : ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం ఉదయం పదిన్నర గంటలకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ భావన తెలిపారు. స్థానిక శారదా దేవి ఆలయం సమీపంలోని నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజల నుంచి నేరుగా సమస్యలపై వినతులు స్వీకరిస్తామన్నారు. ఉదయం 9:30 నుంచి పదిన్నర వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని కూడా నిర్వహిస్తున్నామన్నారు. కార్పొరేషన్ కార్యాలయ ఫోన్ నెంబర్ 0884-2357800కు సమస్యలు తెలియజేయవచ్చని కమిషనర్ సూచించారు. డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ద్వారా ప్రజలు తమ సమస్యలను తెలియజేయవచ్చని కమిషనర్ సూచించారు. ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ పేర్కొన్నారు.

శ్వేతార్క గణపతి 4వ వార్షికోత్సవానికి విచ్చేసిన ఎమ్మెల్యేలు

విశాలాంధ్ర - కరప : మండలంలోని కరప గ్రామంలో చాగంటి సూరిబాబు ఇంట వెలసిన శ్వేతార్క గణపతి నాలుగవ వార్షికోత్సవానికి రాజమండ్రి జిల్లా కొత్తపేట నియోజకవర్గం ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, కోనసీమ జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిరాజు, కాకినాడ జిల్లా, కాకి నాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ సతీమణి పంతం అరుణ వార్షికోత్సవానికి విచ్చేసి గణపతి పూజలో పాల్గొని దేవుని ఆశీస్సులు పొందారు. దైవజ్ఞులు చాగంటి సూరిబాబు ఇంటి వద్దనే శ్వేతార్క గణపతి మహాహెూమాన్ని వేద పండితులతో జరిపించారు. మహా విద్య పారాయణం, వన దుర్గ, వారాహి అమ్మవార్లకు విశేషంగా పూజలు జరిపించారు. ఈ పూజా కార్యక్రమంలో వివిధ జిల్లాలఎమ్మెల్యే దంపతులు పాల్గొని గణపతి ఆశీర్వచనాలు పొందారు. వివిధ గ్రామాల నుండి పూజలలో పాల్గొనేందుకు అధికారులు, విచ్చేశారు. విఘ్నేషుని ఉపాసకులు చాగంటి సుబ్బారావు, ఆంజనేయుని ఉపాసకులు కొండయ్య సిద్ధాంతి హెూమంతో విశేష పూజలు జరిపించారు.

పుదుచ్చేరిలో సీఎం రంగసామి పుట్టినరోజు వేడుక

విశాలాంధ్ర - యానాం : పుదుచ్చేరి ప్రభుత్వ ప్రజల ముఖ్యమంత్రి ఎన్ రంగస్వామి 75వ పుట్టినరోజు సందర్భంగా పుదుచ్చేరిఢిల్లీ అధికార ప్రతినిధి మల్లాడి కృష్ణారావు నేతృత్వంలో యానాం ఎన్ఆర్ కాంగ్రెస్ అధ్యక్షులు మల్లాడి శామ్యూల్, యానాంకు చెందిన పలువురు అభిమానులు, కార్యకర్తలు నేరుగా ముఖ్యమంత్రి పుదుచ్చేరి స్వగృహానికి వెళ్లి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. యానాం సమస్యలపై పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు సమక్షంలో రిప్రజెంటేషన్ లెటర్ని ఇచ్చారు. ఇందులో యానానికి సంబంధించిన వివిధ సమస్యలను తెలియజేస్తూ సత్వరమే పరిష్కరించాలని కోరారు.

ఎస్సీ వర్గీకరణ అమలుపై హర్షం వ్యక్తం

విశాలాంధ్ర - కాజులూరు : ఆదివారం కాజులూరు మండలం గొల్లపాలెం గ్రామంలో ఎస్సీ వర్గీకరణ అమలు గురించి సుప్రీం కోర్ట్ ఇచ్చిన తీర్పుని స్వాగతిస్తూ ఆదివారం భారీ ర్యాలీ నిర్వహించారు. ముందుగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రావ్ విగ్రహాలకు పూలమాలలు వేసి హర్షధ్వనాలు చేశారు. మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. కాజులూరు మండలం అధ్యక్షులు ఖండవల్లి శ్రీనివాసరావు మాదిగ, పలివెల రాజు మాదిగ , సీనియర్ నాయకులు పి వేగేశ్వరావు మాదిగ, సత్తిబాబు మాదిగల అధ్యక్ష తన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మాట్లాడుతూ 30సంవత్సరాలుగా మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో మాదిగలు, మాదిగ ఉపకులాలు, వర్గీకరణకై చేస్తున్న పోరాటానికి ఈరోజు సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుతో నాజులు అందరికి సమన్యాయం జరిగిందని సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో కాజులూరు మండలాధ్యక్షుడు శ్రీనివాసరావు మట్లా డుతూ ఈ తీర్పు ఏ ఒక్కరి గెలుపు-ఓటమిలు కాదని, దీనివల్ల అందరికి సమాన హక్కులు, న్యాయం కలుగుతాయని నాజ వర్గీకరణ జరిగిన కూడా మాల, మాది గలు అందరు ఇంతకు ముందులాగే అన్నదమ్ములుగా కలిసి వుంటామని తెలి పారు. ఈ కార్యక్రమంలో పలివెల సూరిబాబు, సురేష్, దొరబాబు, ఇస్రయేలు రాజు, విశాఖ్, దీ నాగేశ్వరావు, జొన్న కోటి వెంకటేశ్వరరావు. కొల్లు వీరబాబు. ఉందుర్తి బుజ్జి, దండోరా సీనియర్ నాయకులు, నాయకులు, కార్యకర్తలు గొల్లపాలెం ప్రజలు పాల్గొన్నారు.

చిరకాల మిత్రులతో ఎమ్మెల్యే జ్యోతుల

విశాలాంధ్ర - జగ్గంపేట : ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తన చిరకాల మిత్రులతో ఆదివారం స్నేహితుల దినోత్సవాన్ని జరుపుకున్నారు. ప్రపంచ స్నేహితుల దినోత్సవం పురస్కరించుకుని స్థానిక నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో స్నేహితులతో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ స్నేహితులు సోమవరం గ్రామ మాజీ సర్పంచ్ జంపన వెంకట సీతారామచంద్ర వర్మ, తాళ్లూరు గ్రామ మాజీ సర్పంచ్ పాలచర్ల సత్యనారాయణ, మట్టే సుబ్బారావులు పాల్గొన్నారు. అలాగే 1974-75 సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న వారు 65 ఏళ్ల వయస్సులో స్నేహితుల దినోత్సవాన్ని జరుపుకున్నారు. పాత్రికేయులు ఆడపా వెంకట్రావు అధ్వర్యంలో ఆయన స్నేహితులు కలిసి ఆనందంగా గడిపారు.

డీఎస్సీ, టెట్ పరీక్షలకు ఉచిత శిక్షణ

రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి సుభాష్

విశాలాంధ్ర - అమలాపురం : నిరుద్యోగ యువత డీఎస్సీ మరియు టెట్ పరీక్షలకు సన్నద్ధం అయ్యేందుకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్టు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. రామచంద్రాపు రంలోని బుచ్చిరాజు కళ్యాణమండపంలో స్నేహితుల దినోత్సవం సందర్భంగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ "మీట్ ద ప్రెస్" కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురంలోని మీడియా ప్రతినిధులతో కలిసి కేకును కట్ చేసి స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య అధికంగా ఉన్న నేపథ్యంలో దీనిని గుర్తించిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వ ఉద్యోగ నియామకమైన డీఎస్సీ మీద తొలి సంతకం చేశారని, ఐదవ సంతకం నైపుణ్య గణన మీద చేశారని పేర్కొన్నారు. నిరుద్యోగ సమస్యను నిర్మూలించడానికి రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రానికి పరిశ్రమలను తీసుకొచ్చే విధంగా అన్ని చర్యలను చేపడుతోందన్నారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో కూడా జాబ్ మేళాలు నిర్వహించి నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించే కార్యక్రమం చేపడుతున్నామని..దానిలో భాగంగా రామచంద్రపురం విఎస్ఎం కాలేజీలో నిర్వహించిన జాబ్ మేళాలో ఇప్పటి వరకు 850 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించామని తెలిపారు. నేటి పోటీ ప్రపంచంలో ఉద్యోగాలు సాధించడం ఎంతో శ్రమ ఖర్చుతో కూడిన విషయమని, రామచంద్రపురం విఎస్ఎం కాలేజీలో డీఎస్సీ , టెట్ పరీక్షలకు సంబంధించి ఉచిత కోచింగ్ సెంటర్ను ప్రారంభిస్తున్నామని పేర్కొన్నారు. దీనికి సంబంధించిన బ్రౌచర్ను ఆయన ఆవిష్కరించారు. జనరల్ నాలెడ్జ్ మనో విజ్ఞాన శాస్త్రం ఇంగ్లీష్, తెలుగు గణితం సైన్స్ సోషల్లో మంచి ప్రావీణ్యత కలిగిన బోధన సిబ్బందితో శిక్షణ ఇస్తామన్నారు. ఆగస్టు 11 వరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతుందని ఆగస్టు 13 నుంచి శిక్షణ తరగతుల ప్రారంభమవుతాయని ఆయన తెలిపారు. మీడియా ప్రతినిధులకు త్వరలో ఇళ్ల స్థలాలు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

ఎస్సీ, ఎస్టీ సబ్ప్లాన్ నిధులు దుర్వినియోగం కాలేదు

విశాలాంధ్ర - సీతానగరం : ఎస్సీ, ఎస్టీ సబ్ప్లాన్ నిధులలో ఎటువంటి దుర్వినియోగం జరగలేదు అని మాజీ ఉప సర్పంచ్ కాండ్రు శ్రీనివాసరావు అన్నారు. మండలంలో రఘుదేవపురం గ్రామ పంచాయితీ పరిధిలో గత పంచాయతీ పాలనలో ఎటువంటి అవినీతి, నిధులు దుర్వినియోగం జరగలేదు అని కాండ్రు శ్రీనివాసరావు విలేకరులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కాండ్రు శ్రీనివాసరావు మాట్లాడుతూ సామాజిక కర్తగా చెప్పుకుంటూ నా పై నిధులలో దుర్వినియోగం జరిగిందని ఆరోపణలు చేయడం సరికాదని అన్నారు. ప్రభుత్వం నుండి వచ్చిన నిధులను నల్గొండ, రాపాక, రఘుదేవపురం గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు వంటి పనులను అప్పటి ఉన్న పంచాయతీ నెంబర్ల ఆమోదంతో పనులు చేశారని అన్నారు. ఇప్పుడు ఉన్న పంచాయతీ సర్పంచ్ ఆధ్వర్యంలో జరిగిన అవినీతి పై ఇప్పటికే పై అధికారులు రికార్డులను పరిశీలనకు తీసుకొని వెళ్ళారు అని వాటిని త్వరితగతిన పరిశీలించి చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్కు అర్జీ సమర్పించామని అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాశి, పుక్కల శ్రీను, కాండ్రు బుజ్జి, పసలపూడి రామారావు, యలమాటి వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రంధాలయంలో పుస్తక ప్రదర్శన

విశాలాంధ్ర - కాకినాడ : జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలోని కాకినాడ కుళాయి చెరువు పార్కులో గల గాంధీ నగర్ శాఖ గ్రంథాలయంలో 4 ఆదివారం చదవటం మాకిష్టం కార్యక్రమంలో బాలసాహిత్యం పుస్తకములతో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయంలోని బాల సాహిత్యం పుస్తకములను ప్రదర్శనగా ఉంచారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులతో అక్బర్ బీర్బల్ కథలు, అల్లావుద్దీన్ అద్భుతదీపం తదితర పుస్తకములు చదివించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ ములంపాక శ్రీనివాసరావు విద్యార్థులకు పుస్తక పఠనం ఆవశ్యకతను గురించి తెలియజేసి, విద్యార్థులను గ్రంథాలయంలో సభ్యత్వం తీసుకోవాల్సిందిగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ స్వాతి, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

రైస్ మిల్లర్ల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తాం

విశాలాంధ్ర - ఆలమూరు : గత ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరితో రైస్ మిల్లర్లు ఐదేళ్లుగా నష్టాల ఊబిలో కూలిపోయారని, వీరి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు హామీ ఇచ్చారు. ఆదివారం మండల కేంద్రమైన ఆలమూరు శివారు కొత్తూరు సెంటర్లో గల ఎస్జెఆర్ కళ్యాణ మండపంలో రైస్ మిల్లర్ల అసోసియేషన్ ఆధ్వర్యం లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే బండారుకు గజ మాలతో ఘన సత్కారం చేసి కలియుగ దైవంమైన శ్రీనివాసుని విగ్రహం బహుకరించారు. సభలో అధ్యక్షతన వహించిన పారిశ్రామికవేత్త ఒంటిపల్లి పాపారావు మాట్లాడుతూ ప్రస్తుతం ధాన్యం అమ్మకాలు కొనుగోలులో రైతులు, రైస్మిల్లర్లు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, రైతుకు రైస్ మిల్లులకు మధ్య ఎవరి ప్రమేయం లేకుండా రైతు నేరుగా తనకు నచ్చిన రైస్ మిల్కు ధాన్యాన్ని అమ్ముకునే సదుపాయం కల్పించాలన్నారు. అలాగే ప్రభుత్వం నుండి రైస్ మిల్లులకు రావల సిన వేల కోట్లు బకాయిలు ఉన్నాయని వాటిని ప్రభుత్వం రైస్ మిల్లులకు జమ చేసేందుకు తమ సహాయ సహకారాలు అందించాలని కోరారు. రైస్మిల్లర్లు ఉద్దేశించి ఎమ్మెల్యే బండారు మాట్లా డుతూ రాష్ట్రంలో దాన్యభాండ గారంగా పేరొం దిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అటు రైతు లు ఇటు రైసుమిల్లర్లు అనేక ఇబ్బందులు పడ్డారని అది మా దృష్టికి వచ్చిందని, కొత్తపేట నియో జకవర్గంలోనే రూ.35 కోట్లు బకాయిలు చెల్లిం చవలసి ఉందని దానిపై సంబంధిత శాఖ మం త్రులతో చర్చిస్తానని హామీ ఇచ్చారు. మండలం లో 26 రైస్ మిల్లులు ఉన్నాయని ఈ మండలాన్ని రైస్ ఇండస్ట్రీగా తీర్చి దిద్దేందుకు తన వంతు సహకారాలు అందిస్తామన్నారు. మాజీ శాసన మండలి ఉపాధ్యక్షుడు రెడ్డి సుబ్రమణ్యం, నియో జకవర్గం జనసేన ఇన్చార్జ్ బండారు శ్రీనివాసు, కెవి సత్యనారాయణరెడ్డి, ఆకుల రామకృష్ణ, యువ నాయకుడు బండారు సంజీవ్, రైస్ మిల్లర్ల అసోసియేషన్ సభ్యులు రెడ్డి రామారావు, భద్రరావు, చుండ్రు శ్రీను, యడ్లపల్లి కిట్టయ్య, ఒట్టికూటి సతీష్, వంటిపల్లి కృష్ణమూర్తి ఎన్డీఏ కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి ప్రజా వెల్లువ

విశాలాంధ్ర - రాజానగరం : మండలంలోని నందరాడ గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ప్రజలు అధిక సంఖ్యలో లైన్లు కట్టారు. రాజానగరం మండల కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అధ్యక్షులు లంక దొరబాబు , లంక కాశి ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంనికి చెందిన డెల్టా హాస్పిటల్ సారధ్యంలో నందరాడ గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో భాగంగా డెల్టా హాస్పిటల్ వైద్యులు డాక్టర్ మెర్సీ ప్రశాంతి, డాక్టర్ మౌనిక స్థానిక ప్రజలకు కార్డియాక్, అర్థో విభాగాల్లో వైద్య ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈసీజి మరియు షుగర్ పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా అందించారు. అవసరమైన వారికి ఆసుపత్రికి సిఫారు చేశారు. శిబిరంలో భాగంగా సుమారు 160 మంది ఉచిత ఉచిత సేవలు వినియోగించుకున్నారు.

చెందుర్తి గ్రామంలో స్నేహితుల దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - పిఠాపురం : కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం చెందుర్తి గ్రామంలో కొత్త వజ్రకూటం చెందిన చర్చ్లో స్నేహితుల దినోత్సవం సందర్భంగా వేడుకలు నిర్వహించారు. ఇందులో భాగంగా కాకినాడ జిల్లా పార్లమెంట్ సభ్యులు తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్ను ఆహ్వానించారు. వారు అందుబాటులో లేకపోవడంతో వారి ఆదేశాల మేరకు పిఠాపురం జనసేన నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొని స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జనసేన బీసీ నాయకులు నక్కా బద్రి మాట్లాడుతూ గతంలో తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్ ఈ గ్రామానికి చెందిన అనేక కార్యక్రమంలో పాల్గొన్నారని, అలాగే వారి పూర్తి సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలియజేశారని అన్నారు. అలానే ఈ వేడుకల్లో భాగంగా మరల అందరినీ ఇక్కడ కలుసుకోవడం ఎంతో ఆనందం కలిగిస్తుంది అంటూ తమ హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా పిఠాపురం జనసేన నాయకులు, మాజీ సర్పంచి సారిపిల్లి నాగేశ్వరరావు, ఎస్సీ నాయకులు వాస మోహన్, కాకినాడ పాస్టర్ దూది పాల్ శ్రీనివాస్, మడికి ప్రకాష్ పాస్టర్, జనసేన నాయకులు , కార్యకర్తలు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాలను సందర్శించిన పంతం సందీప్

విశాలాంధ్ర - కాకి నాడ : కాకినాడ రూరల్ నియోజకవర్గ శాసన సభ్యు లు పంతం నానాజీ ఆదేశానుసారం, నిన్నటి రోజున రూరల్ మండలం తిమ్మాపురం గ్రామ కూటమి నాయకులు గత ప్రభుత్వం కేటాయించిన ఇండ్లలో స్థానికులు పడుతున్న ఇబ్బందుల గురించి ఎమ్మెల్యే పంతం నానాజీ దృష్టికి తీసుకురాగా ఆయన తనయుడు పంతం సందీప్ స్థానిక కూటమి నాయకులతో కలిసి రూరల్ మండలం తిమ్మాపురం గ్రామం నందు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన ఇళ్ళను, నిర్మాణంలో ఉన్న ఇండ్లను పరిశీలించారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఆ కాలనిలో రోడ్లు, డ్రైన్ల వ్యవస్థ సరిగా లేక అక్కడ నివాసం ఉంటున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటున్నారని డెంగ్యూ, అంటూ వ్యాధులకు గురవుతున్నారని ఎమ్మెల్యే పంతం నానాజీ దృష్టికి ఆయన తనయుడు పంతం సందీప్ తీసుకెళ్లారు. ఎమ్మెల్యే నానాజీ తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకుని పనులు ప్రారంభించాలని సంబంధిత అధికారులకు సూచించారు. గత ప్రభుత్వం అసమర్ధ పాలన వల్ల గత పదేళ్లుగా శుభ్రం చేయని వ్యవసాయానికి సాగు నీరు అందించే పెద్ద కాలువలను ఎమ్మెల్యే సొంత నిధులతో గత రెండు నెలలుగా నిర్విరామంగా కొనసాగుతున్న గుర్రపు డెక్క, పూడిక తీత పనులను తిమ్మాపురంలో స్థానిక కూటమి నాయకులతో కలిసి పరిశీలించారు.

డిజిటల్ అసిస్టెంట్ల మాయాజాలం

- సచివాలయల సేవలపై చేతి వాటం
- రైతుల వద్ద నుండి అధిక మొత్తంలో నగదు వసూలు
- కానరాని సేవల రుసుముల పట్టిక బోర్డులు

విశాలాంధ్ర - సీతానగరం, రాజానగరం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలకు మెరుగైన ప్రభుత్వ సేవలు సులభతరంగా అందించాలనే ఉద్దేశ్యంతో గత ప్రభుత్వం నియమించిన సచివా లయ ఉద్యోగాలలో భాగమైన పలువురు డిజిటల్ అసిస్టెంట్లు మాయాజాలం ప్రదర్శిస్తున్నారు. సచివాలయలలో ప్రజలకు అందించే వివిధ సేవల పై చేతివాటం ప్రదర్శిస్తూ జేబులు నింపుకుం టున్నట్లు పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏపీ ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో వైసిపి ప్రభుత్వంలో ప్రతిష్టా త్మకంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాలలో గ్రామ జనాభా ఆధారంగా సచివాలయలను ప్రజ లకు అందుబాటులోకి తెచ్చింది. దీనిలో భాగంగా ప్రజలకు అందించే సేవలైన అధర్ కార్డు, అడంగల్, ఒన్ బి, పాస్ బుక్, జనన, మరణ ధృవీక రణ వంటి మొదలగు సేవలను సచివాలయలలో గల డిజిటల్ అసిటెంట్ల ద్వారా అందిస్తున్న సం గతి అందరికి తెలిసిందే. రాజానగరం నియోజకవర్గంలోనీ రాజానగరం,సీతానగరం,కోరుకొండ మూడు మండలాల పరిధిలో రాజానగరం మండలంలో 34 సచివలయాలు ఉండగా వాటి లో 32 కార్యాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్లు పనిచేస్తున్నారు. సీతానగరం మండలంలో 20 సచివాలయాలకు గాను 14 కార్యాలయాల్లో అలాగే కోరుకొండ మండలంలో 24 సచివలయా లు ఉండగా వాటిలో 22 కార్యాలయాల్లో డిజి టల్ అసిస్టెంట్లు విధులు నిర్వర్తిస్తున్నారు. ఇంత వరకూ బాగానే ఉన్నప్పటికీ ప్రభుత్వ సేవలు ప్రజ లకు అందించడంలో ప్రధాన పాత్ర పోషిస్తున్న కొంత మంది డిజిటల్ అసిస్టెంట్లు తమ చేతి వాటం చూపుతున్నారనీ అర్జిదారులు ఆరోపిస్తు న్నారు.గ్రామాల్లోనీ సచివాలయాలకు వచ్చే వారిలో అధిక శాతం ప్రజలు పెద్దగా చదువు కొని వారే అందులోనూ రైతులతో ఎక్కువ శాతం ఉన్నారు. ఈ విషయాన్ని గ్రహించిన డిజిటల్ అసిస్టెంట్లు అడంగల్, ఒన్ బి ఫారాలకు ప్రభుత్వ చాలన కేవలం రు:40 ఉండగా వారివద్ద 80 నుండి 100 రూపాయలు, పాస్ బుక్ కోసం 150 కాగా సుమారు 600 వరుకు వసువులు చేస్తూ నిలువు దోపిడి చేస్తున్నారు అని రైతులు అవేదన వ్యక్తం చేశారు. దీనికి తోడు ఏదైనా పని కోసం వెళితే ఇప్పుడు ఖాళీ లేదు తరువాత చేస్తా అంటూ నగదు చెల్లింపుల చేసుకొని రసీదు ఇవ్వ కుండా దాటవేస్తున్నారు అని ఆరోపించారు. దీనిలో కొంత మంది ఒక అడుగు ముందుకు వేసి సేవల రుసుములు ప్రభుత్వ బ్యాంక్ ఖాతా లలో ఆలస్యంగా జమ చేస్తూ బదిలీ వేటు పడిన సందర్భాలు కూడా ఉన్నాయి.ఈ చేతివాటలకు చెక్ పెట్టాలి అంటే ఇంతకు ముందు మీ సేవ కేంద్రాల్లో సేవలకు చెల్లించాల్సిన రుసుముల వివరాల పట్టికను ఏ విధంగా అమర్చారో అదే విధంగా అన్ని గ్రామ సచివాలయలలో ప్రజలకు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

విశాలాంధ్ర గోదావరి జిల్లా

కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

విద్యార్థికి స్కాలర్షిప్ అందజేత

విశాలాంధ్ర-దేవరపల్లి: మండలంలోని త్యాజంపూడి గ్రామానికి చెందిన యంగల ఉమామహేశ్వరి జిఎన్ఎంకోర్సులో విద్యాభాసం చేస్తోంది. తల్లితండ్రులను కోల్పోయిన ఈమె ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు పడుచున్న నేపత్యంలో సదరు విద్యార్థి విద్యాభివృద్ధికి పార్డ్ ఇండియా సంస్థ 6 సంలుగా ప్రతి సంవత్సరం రూ4000/-లనూ స్కాలర్షిప్ను అందిస్తుంది. ఈ నేపత్యంలో ఈ సంవత్సరానికి చెందిన స్కాలర్ షిప్ మొత్తం నాలుగు వేల రూపాయలను స్థానిక పార్డ్ ప్రధాన కార్యాలయంలో విద్యార్థి ఉమామహేశ్వరి కి అందజేశారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరి తన చదువుకోసం గత 2017 సం.నుండి ప్రతి సంవత్సరం స్కాలర్ షిప్ అందిస్తున్న పార్డ్ ఇండియా సంస్థ వ్యవస్థాపకులు బివి. స్వామి తదితర కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సంస్థ కోశాధికారి దేవరాజు అచ్యుతరావు, ఉప కోశాధికారి సోమశెట్టి వెంకట్రావు, డాక్టర్ సత్యనారాయణ, కొంపెల్ల బాబూరావు, కంప్యూటర్ ఆపరేటర్ హేమకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆహార మార్పులతోనే వ్యాధులు

- **రానున్న కాలంలో మైక్రోబయాలజీ కీలకం**
- **జీఎస్ఎల్లో ముగిసిన రాష్ట్రా స్థాయి విజ్ఞాన సదస్సు**

విశాలాంధ్ర - రాజానగరం : ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రతిఒక్కరు తినే ఆహారంలో మార్పుల వల్లే అనేక మందికి మంచిని అందించే బాక్టీరి యాలో సమతూకం దెబ్బతిని రకరకాల వ్యాధులు వ్యాపిస్తున్నాయని అంతర్జా తీయ ప్రముఖ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ వైద్యులు పద్మభూషణ్ డాక్టర్ డి నాగేశ్వర్ రెడ్డి అన్నారు. మండలంలోని జిఎస్ఎల్ వైద్య కళాశాలలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ఆధ్వర్యంలో రెండు రోజులుగా జరిగిన సౌత్ జోన్ వైద్య విజ్ఞాన సదస్సులు ఆదివారంతో ఘనంగా ముగిశాయి. రెండవ రోజు సదస్సుకి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ జీర్ణకోశ వ్యాధులు,గ్యాస్ట్రిక్ సమస్యలు భారిన పడుతున్న వారి సంఖ్య అధికమవుతుందన్నారు. రానున్న ఐదారేళ్ళలో వ్యాధి నిర్ధారణ, చికిత్సలకు "మైక్రోబయాలజీ" కీలకం అవుతుందని చెప్పారు. సహజ స్వాభా విక ఆహారం, అవసరమైన బాక్టీరియాను ఇవ్వడమే వ్యాధులకు భవిష్యత్తులో చికిత్స రాగలదని వివరించారు. బాక్టీరియా గురించి చర్చించే మైక్రోబయాలజీ రంగంలో ప్రపంచ వ్యాప్తంగా 100 సెంటర్లలో అధ్యయనాలు పరిశోధనలు జరుగుతున్నాయి. భారతదేశంలో 6 కేంద్రాల్లో పరిశోధనలు జరుగుతుండగా అందులో ప్రయివేట్ రంగంలోని ఏకైక సంస్థ ఆసియన్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రోఎంటరాలజి - ఎఐజి కి తాను చైర్మన్గా ఉన్నట్లు చెప్పారు.పేగుల్లో నివశించే 1000 రకాల బాక్టీరియాలో హెచ్చు తగ్గులు రకరకాల వ్యాధులకు కారణమౌతున్నాయన్నారు. సిజేరియన్ కాకుండా సహజప్రసవం ద్వారా పుట్టిన బిడ్డలు, కనీసం ఆరునెలలు తల్లిపాలు తాగిన బిడ్డలు, ఆరు నెలల లోపు ఏంటీబయోటిక్స్ వాడని పిల్లల్లో మంచి బాక్టీరియా వల్ల ఆరోగ్య సమస్యలు వుండటం లేదని బావి వైద్యులకి ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఇంటి భోజనం చేసే వారికి బయటి జంక్ ఆహారం తీసుకునే వారికీ బాక్టీరియాల్లో తేడాలను తమ సంస్థ ప్రయోగాల్లో గమనించిందన్నారు. మన వాతావరణానికి సరిపడే ఇడ్లీ,దోసె పెరుగు మొదలైనవి తిన్నవారిలో కేన్సర్ నెమ్మదించిన అధ్యయనాలు వున్నాయని వివరిం చారు. వైద్య విజ్ఞానం పెంపొందించే ఇటువంటి సదస్సులను యువ వైద్యులు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం అతిధులను ఘనంగా సత్కరించారు. చిత్రపటాలు, జ్ఞాపికలు అందజేశారు. డాక్టర్ వాగ్దేవు రవి,డాక్టర్ వివిఎస్.ఎన్ మూర్తి, చైర్ పర్సన్లు గా వ్యవహరించిన ఈ సదస్సులో జిఎస్ఎల్ విద్యా సంస్థలు చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు, డాక్టర్ వాణీమాధవి,డాక్టర్ పిఎస్ఎస్ శర్మ,డాక్టర్ సోమనాథ్ దాస్, వివిధ విభాగాల అధిపతులు, వైద్యులు పాల్గొన్నారు.

ఏపీపీటీడీఈ రాష్ట్ర కోశాధికారిగా భీమన సూరిబాబు

విశాలాంధ్ర - ఏలేశ్వరం : ఏలేశ్వరం డిపోలో కండక్టర్గా పనిచేస్తున్న భీమన సూరిబాబు ఆంధ్రప్రదేశ్ ప్రజా రవాణా సంస్థ ఎంప్లాయిస్ యూనియన్ కోశాధికారిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా భీమన సూరిబాబు మాట్లాడుతూ ఇటీవల ఆంధ్రప్రదేశ్ ప్రజా రవాణా సంస్థ ఎంప్లాయిన్ యూనియన్ సర్వసభ్య సమావేశం విజయవాడలో నిర్వహించారన్నారు. ఈ సమావేశంలో యూనియన్ కోశాధికారిగా ఏకగ్రీవంగా ఎంపిక చేసినందుకు యూనియన్ అధ్యక్ష కార్యదర్శులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో ఏపీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ మాట్లాడుతూ ప్రజా రవాణా (ఏపీఎస్ఆర్టీసీ) ఉద్యోగ విలీన సమస్యలను పరిష్కరిం చాలన్నారు. సర్క్యులర్ నిబంధనలకు విరుద్ధంగా అనాగరిక క్రమశిక్షణ చర్యలను అమలు పరుస్తున్నారని వీటన్నిటిని ప్రస్తుత ప్రభుత్వం సవరించాల్సిన అవసరం ఉందన్నారు.

బంధుత్వం కన్నా ... స్నేహం మిన్న

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి మండలం గౌరీపట్నంలో ఫ్రెండ్షిప్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్నేహితులందరూ పరస్పరం అభినందనలు తెలియజేసుకుని కేక్ కట్ చేసి ఆనందం పంచుకున్నారు . ఈ సందర్భంగా పోలుమాటి నాని మాట్లాడుతూ స్నేహం ఎంతో మధురమైనదని బంధుత్వం కన్నా స్నేహం మిన్న అని అన్నారు ఈ సందర్భంగా నిర్మలగిరి మేరీ మాత ఆలయం వద్ద వృద్ధులకు వికలాంగులకు భోజన ప్యాకెట్లు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పెనుమాక వెంకటేశు మడేల్లి నాని బోనగిరి ప్రదీప్ దేకపాటి రమేష్ మారిశెట్టి నాగేశ్వరరావు పి శ్రీను నూతంగి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

విశాలాంధ్ర - పెదపూడి : ఉత్తమ స్నేహితులు లేని జీవితాన్ని మనం ఊహించలేము. ఏడిస్తే ఓదార్చి, చేయి అందించేది స్నేహితులే. ఆదివారం స్నేహితుల దినోత్సవం సందర్భంగా అనపర్తి జిబిఆర్ డిగ్రీ కళాశాల 1987-90 బ్యాచ్‌కి చెందిన పూర్వపు విద్యార్థులు కాకినాడ హెటల్ వెజ్ ట్రీట్‌లో రామ్ గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. దాదాపు 34 ఏళ్ళ తర్వాత కలుసుకున్న పూర్వపు విద్యార్థులు ఒకరినొకరు పలకరించుకుంటూ ఒకరి యోగ క్షేమాలు మరొకరు అడిగి తెలుసుకుని పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. కళాశాలలో విద్యను అభ్యసించిన రోజుల్లో గత స్మృతులను నెమరు వేసుకున్నారు.

బాలికకు ఆర్థిక సాయం అందజేత

విశాలాంధ్ర - మామిడికుదురు : అప్పనపల్లి గ్రామంలోని అరుంధతీపేటకు చెందిన 13 ఏళ్ల బాలిక ఆకుమర్తి జ్యోతి అరుదైన వ్యాధితో బాధపడుతుంది. ఆమె తండ్రి రమేష్ ఆటో డ్రైవర్. ఆమెకు వైద్యం అందించేందుకు ఆరోగ్యశ్రీలో అవకాశం లేదని డాక్టరు చెప్పారు. ఒక్కొక్క ఇంజక్షన్ రూ.85 వేలు. మొత్తం పది ఇంజక్షన్లు చేయాలని చెప్పారని బాలిక తండ్రి రమేష్ వాపోయారు. మూడు నెలల నుంచి బాలిక అనారోగ్యంతో బాధపడుతుందన్నారు. ఇంత వరకు మూడు ఇంజక్షన్లు చేయించామని కుటుంబ సభ్యులు తెలిపారు. చిన్నారికి వైద్యం చేయించే ఆర్థిక స్తోమత లేక పోవడంతో దాతల సహాయం కోసం ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో స్థానికులు రూ.10 వేలు వసూలు చేసి ఆ సహాయాన్ని ఆదివారం బాలిక జ్యోతితో పాటు ఆమె తండ్రి రమేష్, తల్లి శాంతికుమారికి అందించారు. దాతలు స్వచ్ఛందంగా వచ్చి బాలికకు ఆర్థిక సహాయం అందించాలని ఆర్ఎంపీ కంకిపాటి వెంకటేశ్వరరావు కోరారు. కార్యక్రమంలో తులా గోపాలకృష్ణ, తులా నాగరాజు, చిన్న, వినయ్, కంకిపాటి నాగేశ్వరరావు, తులా బ్రహ్మాజీ, అల్లూరి సుబ్బరాజు, స్థానికులు పాల్గొన్నారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో పారిశుధ్య పనులు

విశాలాంధ్ర - మామిడికుదురు : వరద ప్రభావిత ప్రాంతమైన పెదపట్నం గ్రామంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టినట్లు సెక్రటరీ జీవివి మైథిలి తెలిపారు. ఆదివారం పెదపట్నం గ్రామ పరిధిలోని చక్రవర్తి సెంటర్, గుర్రంవారిపేట, పెదపట్నం రేవు, అరుంధతి పేట తదితర ప్రాంతంలో పారిశుధ్య పనులు నిర్వహించారు. దోమల నివారణకు డ్రెయిన్లు, మురికి నీరు నిల్వ ఉన్న చోట్ల ఆయిల్ బాల్స్ వేశారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో వైరల్ జ్వరాలు ప్రబలకుండా ముందస్తు నివారణ చర్యల్లో భాగంగా పారిశుధ్య పనులు నిర్వహించినట్లు సెక్రటరీ మైథిలి తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ పీఆర్ ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి 1983-84)బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఘనంగా జరిగింది. కాకినాడ రూరల్ రమణయ్యపేట ఎస్ఆర్ఎంటి చౌదరి గెస్ట్ హౌస్ ఎదురుగా గల కన్వెన్షన్ హాల్ జరిగింది. 40 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆగస్టు 4న ఫ్రెండ్షిప్ డే రోజున స్నేహితులందరూ కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎప్పుడో 40 ఏళ్ల క్రితం కలిసిన వాళ్లందరికీ తెలియని అనుభూతి. కొంతమంది రూపురేఖల మారి గుర్తు పట్టలేనంతగా ఉన్నారు. అలాంటిది అరేయ్, ఒరేయ్, పిలుచుకుంటుంటే ఆ ఆనం దమే వేరు. పిఆర్ ప్రభుత్వ పాఠశాల మన తరగతుల్లో చేసిన అల్లర్లు ఒక్కొక్కరు గుర్తు చేసుకుని చెప్పుకుంటూ అనుభూతిని పంచుకున్నారు. ఆ..తీపి గుర్తులను అందరూ ఒక చోట కలిసి ఒకరికొకరు పంచుకోవడం మనసుని ఆహ్లాద పరిచింది. ఒరేయ్ మీ అబ్బాయి ఏం చేస్తున్నాడు రా..ఒరేయ్ మీ అమ్మాయిని ఎవరికిచ్చావురా..అని ఒకరు ఒకరు పలకరించుకుని కుటుంబ పరిస్థితి తెలుసుకుంటూ ఆనందపడ్డారు. నాకు తెలిసి ఉండగా ఒకరికొకరు కొంతమంది తాతలై ఉన్నారు. ఇందులో వైద్యులుగా, ఇంజనీర్లుగా, లాయర్లుగా స్థిరపడి వారందరూ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. రాష్ట్రంలోనే కాకుండా దేశంలోనే ఉన్నత అధికారులుగా పనిచేసిన వారందరూ కూడా ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌కు నమోదు

విశాలాంధ్ర-పెదపారుపూడి : సీఎం రిలీఫ్ ఫండ్ కొరకు నేడు పామర్రు టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా సోమవారం ఉదయం 10 గంటలకు ప్రారంభిస్తారని టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి, ప్రధాన కార్యదర్శి మసిముక్కు రాంబాబు ఒక ప్రకటనలో ఆదివారం తెలిపారు. ఈ విషయమై మండలంలోని అర్హత ఉన్న లబ్ధిదారులు తప్పక హాజరై దరఖాస్తు చేసుకోవాలని అన్నారు.

కూచిపూడి ఎస్ఐ బదిలీ

విశాలాంధ్ర-కూచిపూడి : పామర్రు సర్కిల్ పరిధిలోని కూచిపూడి పోలీస్ స్టేషన్ ఎస్ఐ టి శ్రీనివాస్ బదిలీ అయ్యారు. జిల్లాలో 23 మంది ఎస్ఐలనుబదిలీచేసిన కార్యక్రమంలో భాగంగా ఈయనకు కూడా బదిలీ జరిగింది.ఈ ఏడాది ఫిబ్రవరి 8నకూచిపూడి పోలీస్ స్టేషన్ఎస్సైగాబాధ్యతలు చేపట్టి ఆరు నెలల పాటు విధులు నిర్వహించిన శ్రీనివాస్.నువిఆర్.కి పంపారు. అవనిగడ్డ సర్కిల్ పరిధిలోని నాగాయలంక పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఎం. సుబ్రహ్మణ్యం ను కూచిపూడి కి బదిలీ చేస్తూ కృష్ణా జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర్ రావు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు.

నిరుపేదల ఆశాజ్యోతి రంగసామి

విశాలాంధ్ర - యానాం : ప్రజల మనిషి నిరుపేదల ఆశాజ్యోతి ప్రజా సేవలో అలుపెరగని సేవకుడు యానాం ప్రజల ప్రియతమ నాయకుడు పుదుచ్చేరి రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు ఎన్ రంగసామి పుట్టినరోజు సందర్భంగా మల్లాడి కృష్ణారావు స్వగృహం వద్ద నాయకులు, అభిమానులు, కార్యకర్తలు, ఆశావర్కర్లు పాల్గొని రంగస్వామి పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కటింగ్ చేసి ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేసి స్వీట్స్ పంచిపెట్టుకున్నారు. అనంతరం యానాం ఓల్డ్ ఏజ్ హెమ్‌లో వృద్ధులకు, యానాం గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్‌లో ఉన్న పేషెంట్లకు ఫ్రూట్స్ పంచిపెట్టిన యానాం మాజీ మున్సిపల్ చైర్మన్ గిడ్ల చంద్రరావు, యానాం రిటైర్డ్ సిఐ గూటం శివ గణేష్, మట్టపర్తి గణేష్, వెంకటేశ్వరరావు, మల్లాడి శ్రీను, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్ఐ శ్రీను నాయక్‌కు చిత్రపటం బహుకరణ

విశాలాంధ్ర - ఆలమూరు : ఆలమూరు పోలీసు స్టేషన్‌లో ఆదివారం ఎస్సై ఎల్ శ్రీను నాయక్‌కు స్వయ చిత్రపటం బహుకరణ ఇచ్చారు. రాయవరం మండలంలోని వెదురుపాక జడ్పీ హైస్కూల్‌లో డ్రాయింగ్ టీచర్‌గా పని చేస్తున్న వాసంశెట్టి రాధాకృష్ణ వారం రోజుల పాటు శ్రమించి ఎస్సై శ్రీను నాయక్ ఫోటోను కాన్వాయస్ పద్ధతిలో రంగులతో అద్ది చిత్రపటాన్ని తీర్చిదిద్దారు. అనంతరం ఆ చిత్ర పటాన్ని పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి ఎస్సై శ్రీను నాయక్‌కు అందజేశారు. మూడేళ్ల క్రితం రాయవరం ఎస్సైగా పని చేసి కోవిడ్-19 సమయంలో అనేక మందికి సకాలంలో టీకాలు వేయించడంతో పాటు ఔషధాల కొరత రానీయకుండా చర్యలు తీసుకున్నారు. అందులో భాగంగా ఆ సేవలకు మెచ్చి టీచర్ గోపీకృష్ణ ఈ చిత్రపటాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా ఎస్సై శ్రీను నాయక్‌ను అనేక మంది అభిమానులు అభినందించారు. ఏఎస్సైలు ఎం సూర్యచంద్రరావు, కెవి రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

విశాలాంధ్ర- దేవరపల్లి: దేవరపల్లి మండల లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం దేవరపల్లి మండలం పలంట్ల గ్రామంలో స్కూల్ వద్ద నిడదవోలు రాజేశ్వరి రామకృష్ణ వైద్యశాల వారి సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు ఈ వైద్య శిబిరానికి 150 మంది పరీక్షలు చేశారు, ఉచిత ఆపరేషన్లకు 24 మందిని సిఫార్సు చేశామని దేవరపల్లి లయన్స్ క్లబ్ అధ్యక్షులు కూచిపూడి తిలక్ తెలిపారు ఈ కార్యక్రమానికి డాక్టర్ సిహెచ్ నాగరాజు, కోఆర్డినేటర్ శ్రావణి, సూపర్వైజర్ కే రాము, లైన్స్ క్లబ్ సభ్యులు,మండల టిడిపి నాయకులు కొయ్యలమూడి చినబాబు తదితరులు పాల్గొన్నారు ఈ సందర్భంగా మండల లైన్స్ క్లబ్ అధ్యక్షుడు కూచిపూడి తిలక్ మాట్లాడుతూ %ాఅ్గ జ ఐ% సూర్య ప్రకాష్ రావు ప్రోత్సాహంతో మరియు లైన్స్ క్లబ్ సభ్యులు సహకారంతో ఇటువంటి ఉచిత శిబిరాలు నిర్వహించడం జరుగుతుందని దీన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు

శ్రీనివాస్ వర్మ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - ముమ్మిడివరం : బిజెపి జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు ఆదేశాల మేరకు ముమ్మిడివరం సామాజిక ఆరోగ్య కేంద్రం 30 పడకలు ఆస్పత్రిలో జిల్లా ట్రెజరర్ గ్రంధి నానాజీ అధ్యక్షతన కేంద్రమంత్రి భారీ పరిశ్రమల ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ జన్మదిన సందర్భంగా హాస్పిటల్ వద్ద పేషెంట్లకు బత్తాయి, దానిమ్మ పళ్ళను, బ్రెడ్ పంచారు. డాక్టర్ పృథ్వి స్టాఫ్ రామకృష్ణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమంలో ముమ్మిడివరం టౌన్ అధ్యక్షులు కొయ్యల దుర్గారావు సెక్రటరీ కోనే రామ్మూర్తి, యువ మోర్చా అధ్యక్షుడు జగతా రామారావు, కాట్రేనికోన మండల ప్రెసిడెంట్ మట్ట సూరిబాబు, జనరల్ సెక్రెటరీ కొడమంచిలి సురేష్, ఓబీసీ అధ్యక్షులు ఎన్ పద్మారావు పాల్గొన్నారు.

శాకంబరీ అమ్మవారిగా పూరిహూతీక దేవీ

విశాలాంధ్ర - పిఠాపురం : అష్టాదశ శక్తిపీఠాలలో 10వ శక్తిపీఠంగా వెలసిన పూరుహూతీక అమ్మవారికి ఆషాడమాసం అమావాస్య సందర్భంగా శాకంబరీ అమ్మ వారిగా దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్‌వి ఎస్ఎన్ వర్మ సతీమణి లక్ష్మీ దేవి అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కార్య నిర్వాహణాధికారి అల్లు వేంకట దుర్గా భవాని, వేదపండితులు అశీర్వచనం నిర్వహించారు. శేషవస్త్రాలతో ఆమెను ఆలయ ఈఓ సత్కరించారు.

రక్షణ రంగంలో భారీగా పెరగనున్న ఎగుమతులు

విశాలాంధ్ర-అవనిగడ్డ : రక్షణ రంగ ఎగుమతుల్లో భారతదేశం త్వరలో రూ. 50 వేల కోట్ల నుంచి రూ.80 వేల కోట్ల స్థాయికి ఎదిగే అవకాశం ఉందని భారత రక్షణ శాస్త్రవేత్త డాక్టర్ జీ.సతీష్ రెడ్డి అన్నారు. ఆదివారం అవనిగడ్డ గాంధీక్షేత్రంలో దివిసీమ గాంధీ స్వర్గీయ మండలి వెంకట కృష్ణారావు 99వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. మండలి వెంకట కృష్ణారావు స్మారక తెలుగు వైభవ పురస్కారం అందుకునేందుకు విచ్చేసిన డాక్టర్ సతీష్ రెడ్డి, ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యూ దుర్గాప్రసాదరావు, ఆత్మీయ అతిథులు, విశ్రాంత న్యాయమూర్తులు జస్టిస్ గ్రంధి భవాని ప్రసాద్, జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి, సిలికాన్ ఆంధ్ర వ్యవస్థాపకులు కూచిభోట్ల ఆనంద్, జమీన్ రైతు సంపాదకులు డోలేంద్ర ప్రసాద్, అవనిగడ్డ బస్టాండ్ సెంటరులో, గాంధీ క్షేత్రంలో మండలి వెంకట కృష్ణారావు విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అవనిగడ్డ నియోజకవర్గ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ - విజయలక్ష్మి దంపతులు, నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ - సాయి సుప్రియ దంపతులు, తమ కుటుంబ సభ్యులతో కలిసి డాక్టర్ సతీష్ రెడ్డిని ఘనంగా సత్కరించి మండలి వెంకట కృష్ణారావు స్మారక తెలుగు వైభవ పురస్కారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సతీష్ రెడ్డి ప్రసంగిస్తూ తెలుగు భాష వైభవం కోసం పాటుపడిన మహనీయులు మండలి వెంకట కృష్ణారావు అన్నారు. మండలి ఫౌండేషన్ ద్వారా ఈ పురస్కారం అందుకోవటం గర్వకారణం అన్నారు. రక్షణ పరిశోధన రంగంలో భారతదేశం ప్రపంచానికే నాయకునిగా ఎదుగుతోందన్నారు. రక్షణ పరిశోధన రంగంలో మనదేశం పూర్తి స్వావలంబన సాధించిందన్నారు. విద్యా రంగంలో 2023లో లక్షా 90 వేల పబ్లికేషన్స్ ద్వారా మనదేశం ప్రపంచంలో మూడవ స్థానంలో నిలిచిందన్నారు. 2023లో మనదేశంలో 24వేల మంది పీ. హెచ్.డీలు చేసారని, తద్వారా మనదేశం ప్రపంచంలో రెండో స్థానంలో నిలిచిందన్నారు. భారత్ తయారు చేసిన 155 ఎంఎం గన్ ఇప్పటికి ప్రపంచంలో మరే ఇతర దేశం దగ్గర లేదన్నారు. ఈ ప్రాంతంలో నిమ్మకూరులో ఏర్పాటు చేసిన బెల్ కంపెనీ ద్వారా త్వరలో ప్రపంచానికి ఎగుమతులు ఉంటాయన్నారు. నాగాయలంక మండలం గుల్లలమోద క్షిపణి పరిశోధన కేంద్రం త్వరలో సాకారం అవుతుందన్నారు. ముఖ్య అతిధి రాకెట్ తయారీకి భారతదేశం మార్గదర్శి అనే గుర్తింపు రావటం గర్వకారణం అన్నారు.

వంధ్యత్వం, ఐవిఎఫ్ ప్రచారం విజయవంతం

విశాలాంధ్ర - రాజమండ్రి: ప్రపంచ ఐవిఎఫ్ దినోత్సవం 2024ను పురస్కరించుకుని ఫెర్టీ9 ఫెర్టిలిటీ సెంటర్ ప్రారంభించిన వినూత్నమైన టుగెదర్ ఇన్ ఐవిఎఫ్ ప్రచారాన్ని విజయవంతంగా పూర్తి చేసినట్లు వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలలో నిర్వహించిన ఈ ప్రచారం ద్వారా ప్రజలలో అవగాహన మెరుగుపరచడం, ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్ (ఐవిఎఫ్) పట్ల అంగీకారాన్ని పెంచడం లక్ష్యంగా చేసుకుంది. అదే సమయంలో వంధ్యత్వానికి సంబంధించిన అపోహలను పోగొట్టడం , తమ సంతానోత్పత్తి చికిత్స గురించి తగిన సమాచారంతో నిర్ణయాలు తీసుకునేలా జంటలను ప్రోత్సహించటం చేసింది. ఈ ప్రచారం కింద, ప్రపంచ ఐవిఎఫ్ దినోత్సవ వారంలో భాగంగా ఆంధ్ర ప్రదేశ్ , తెలంగాణా అంతటా 15 వేర్వేరు ప్రదేశాలలో వీధి నాటకాలు లేదా నుక్కడ్ నాటకాలను ప్రదర్శించింది. తద్వారా అధిక సంఖ్యలో ప్రజలకు చేరువైంది. ఈ ప్రదర్శనలు అనుకూలమైన మరియు ప్రభావవంతమైన పద్ధతిలో సాధారణ ప్రజల కోసం వంధ్యత్వం, ఐవిఎఫ్ పట్ల ఉన్న అపోహలను నిర్వీర్యం చేయడంలో సహాయపడ్డాయి.

సంగీతం మానసిక ఆరోగ్యంపై గణనీయమైన ప్రభావాన్ని చూపుతుందని నిరూపించబడింది. ఇది ఒత్తిడి , ఆందోళనను తగ్గిస్తుంది. ఈ ప్రచా రంలో భాగంగా, ఫెర్టీ9 మ్యూజిక్ ఆఫ్ హెూప్ను ప్రారంభించింది, ఇది వంధ్య త్వానికి చికిత్స చేసే ప్రయాణంతో సంపూర్ణత, ప్రశాంతతను అనుసంధానించడానికి రూపొందించబడిన ఒక మధురమైన సంగీతం. ఈ ట్యూన్ విడుదల సమయంలో, ప్రేక్షకులు శాంతియుత వాతావరణంలో ట్యూన్‌ను విన్నారు, దాని ప్రశాంతత ప్రభావాలను పూర్తిగా అనుభవించడానికి ఇది వీలు కల్పించింది. ఈ విశ్రాంతి సంగీతాన్ని జోడించడం ద్వారా, ఫెర్టీ9 తమ రోగులకు అదనపు సౌకర్యం మరియు మద్దతును అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఏపీ, తెలంగాణ వ్యాప్తంగా 3000 మంది గైనకాలజిస్టులకు ఈ ట్యూన్‌ను చేరవేశారు.

కూటమికి పట్టంతో మొక్కు చెల్లింపు
టీడీపీ నేత గుత్తుల మురళీ

విశాలాంధ్ర - కాకినాడ : అరాచక వైకాపా పాలన నుండి రాష్ట్ర ప్రజలకు విముక్తి కలగాలని అలాగే రాష్ట్రంలో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావాలని కోరుతూ తాను మొక్కుకున్నానని ఆదివారం సగం తీర్చుకుంటున్నానని మరో సగం సోమవారం తిరుపతి పుణ్యక్షేత్రంలో చెల్లించుకుంటున్నట్లు కాకినాడ రూరల్ మండలం ఇంద్రపాలెం టీడీపీ గ్రామ కమిటీ మాజీ అధ్యక్షుడు గుత్తుల మురళీ వీరభద్రరావు (మురళీ) పేర్కొన్నారు. కాకినాడ రూరల్ ఎమ్మెల్యేగా పంతం నానాజీ గెలవాలని, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని కోరుతూ తాను మొక్కుకోవడంతో ఆదివారం ఇంద్రపాలెం గ్రామ దేవత ముసలమ్మ తల్లి ఆలయం ఎదురుగా సగం గుండు చేయించుకోగా మిగిలిన సగం ఆదివారం సాయంత్రం బయలుదేరి సోమవారం తిరుపతిలో చెల్లించుకుని స్వామివారి దర్శనం చేసుకుంటానని మురళి చెప్పారు. ఆదివారం ఇంద్రపాలెంలోని ముసలమ్మ తల్లి గుడి ఎదురుగా తల నీలాల మొక్కు చెల్లింపు కార్యక్రమాన్ని మురళీ నిర్వహించారు. ఈ సందర్భంగా మురళీ మాట్లాడుతూ రాష్ట్రంలో గడచిన ఐదేళ్ల కాలంలో వైసీపీ ప్రభుత్వం ఎన్నో అరాచకాలు, అక్రమాలకు పాల్పడిందని దీంతో ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం గడిపారన్నారు. ఈ సమయంలో వైసీపీ పోవాలని టీడీపీ ప్రభుత్వం రావాలంటూ తాను మొక్కుకున్నానన్నారు. తన మాట విన్న ముసలమ్మతల్లి అమ్మవారు, తిరుమల వెంకటేశ్వర స్వామి వారు, రాష్ట్ర ప్రజలు దృష్ట్యా వైకాపా నుంచి రాష్ట్రానికి విముక్తి కలిగించారన్నారు. అలాగే రాష్ట్రంలో ప్రజా రంజక పాలనను అందించి కూటమి ప్రభుత్వం ప్రజా మన్ననలు పొందాలని ఆశిస్తున్నట్లు మురళీ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇంద్రపాలెం మాజీ సర్పంచ్ గుత్తుల రామలింగేశ్వర రావు, టీడీపీ నాయుకులు అనసూరి పుల్లయ్య, టేకుమూడి శ్రీనివాస్, పెదపూడి నాని, రాయుడు విజయ్, గుత్తుల రాజు, మేడిశెట్టి సుదీర్, గుత్తుల చిన్న, గుత్తుల కృష్ణ మూర్తి, పెంకే శంకర్, కాళ్ళ మూర్తి, అనసూరి జగదీశ్, జనసేన నాయకులు దొడ్డిపట్ల అప్పారావు, జనసేన నాయుకులు సూది శ్రీను, తదితరులు పాల్గొన్నారు. మొక్కు చెల్లించుకున్న మురళీని పలువురు అభినందించారు.

ఐక్య జేఏసితోనే మాలమహానాడు పోరాటం

విశాలాంధ్ర - అమలాపురం : ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా భవిష్యత్తులో జరిగే పోరాటాలన్నీ ఐక్య జెఎసి ద్వారానే జరుగుతాయని మాలమహానాడు సంఘాలన్నీ పిలుపు నిచ్చాయి. ఆదివారం అమలాపురం సావరంలో మాలమహానాడు జెఎసి ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. డా బిఆర్ అంబెడ్కర్ కోనసీమ జిల్లా మాల మహానాడు కమిటీలు అన్నీ కలిసి మాల మహానాడు జాయింట్ యాక్షన్‌గా ఆగస్టు 11న మాల మృత వీరుల సంస్మరణ దినం సందర్భంగా మృత వీరులకు ఘన నివాళి అర్పించడం జరుగుతుంది అని, అనంతరం ఎస్సీ వర్గీకరణ వ్యతిరేఖ నిరసన కార్యక్రమం చేపట్టాలని మాలమహానాడు జెఎసి నిర్ణయం తీసుకుంది. అలాగే మాల మహానాడు అనే బ్రాండ్‌ని పివి రావు త్యాగాన్ని నిర్వీర్యం చేసే అధికారం ఎవరికీ లేదని, ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాటం ఎప్పటికీ మాలమహానాడు జెఎసి ద్వారా నే జరుగుతుందని, మాలమహానాడు జేఏసీ తీర్మానించింది. ఈ కార్యక్రమంలో పండు అశోక్ కుమార్, ఎంఎకె భీమారావు, జగడం సత్యనారాయణ, చీకురుమెల్లి కిరణ్ కుమార్, ఉండ్రు బాబ్జి, పోతుల నాగరాజు, పెనుమాల చిట్టిబాబు, కాశి వెంకట్రావు, పెయ్యల పరశురాముడు, పెయ్యల పరశురాముడు, పరమట రాం ప్రసాద్, జల్లి శ్రీనివాస్, నాతి శ్రీనివాస్, చింతా రామకృష్ణ, మోకా శ్రీనివాస్, పోతుముడి రవికుమార్, కుంచే బాబులు, రేవు ప్రసాద్, ఉబ్బన శ్రీను, సాపే రమేష్, మెండి డేవిడ్ అంబేద్కర్ పాల్గొన్నారు.

ఘనంగా శ్రీమరిడమ్మ అమ్మవారి జాతర

విశాలాంధ్ర -ఏలేశ్వరం : పట్టణంలోని స్థానిక లారీ యూనియన్ ఆఫీసు వద్ద వేంచేసి ఉన్న శ్రీ మరిడమ్మ తల్లి అమ్మవారి జాతర మహోత్సవాలను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ జాతర మహోత్సవాలలో భాగంగా గరగనృత్యాలు, శక్తి వేషాలు ఆకర్షణీయంగా నిలిచాయి. అనంతరం తీర్థ మహోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రతి ఏడాది ఆషాడ మాసం చివరి వారంలో అమ్మవారికి జాతర, తీర్థ మహోత్సవాలను నిర్వహిస్తామని ఈ తీర్థ మహోత్సవంకు చుట్టు పక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరిస్తారని వారు అన్నారు.

గత ప్రభుత్వ విధానాలనే కొనసాగిస్తారా : ఏపీటీఎఫ్

విశాలాంధ్ర-భీమవరం: గత ప్రభుత్వం అనుసరించిన విధానాల వల్ల విద్యారంగంలో అనేక సమస్యలు ఉత్పన్నం అయ్యాయని మళ్లీ అవే తప్పిదాలను కొనసాగించాలని కూటమి ప్రభుత్వం చూస్తున్నట్లు తెలుస్తోందని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు జి.ప్రకాశం, ప్రధాన కార్యదర్శి బి.వి.నారాయణ ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం వారు భీమవరంలో మీడియాకు ప్రకటన విడుదల చేసి మాట్లాడుతూ పాఠశాల వ్యవస్థను తీవ్రంగా నష్టం చేసిన 117 జీవో రద్దు చేస్తామని ప్రకటించిన కూటమి సర్కారు ఇప్పటి వరకు ఆ ప్రయత్నం చేయకపోగ ఇప్పుడు తాజాగా జరగనున్న పని సర్దుబాటుతో ఆ జీవో కు ప్రాధాన్యత ఇస్తున్నట్టు అధికారులు ఒక సమావేశంలో తెలిపినట్లు తెలుస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. పని సర్దుబాటు జిల్లాస్థాయి, మండల స్థాయిలో నిర్వహించకుండా రాష్ట్రస్థాయిలో కమిషనరేట్ నుంచి జరపాలని నిర్ణయించడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. గతంలో జరిపిన సర్దుబాటు వల్ల ఉపాధ్యాయులకు ఇబ్బంది తలెత్తితే జిల్లాస్థాయి మండల స్థాయి అధికారులు పరిష్కరించేవారు ఇప్పుడు ఆ అవకాశం కూడా ఇవ్వకుండా కమిషనరేట్ నుంచి నిర్వహించడం సరైన విధానం కాదని వారు విమర్శించారు. 10 మంది విద్యార్థుల లోపు ఉన్న పాఠశాలలను మూసివేసే ప్రయత్నం కూడా చేస్తున్నట్టు తెలుస్తోందని ఇది విద్యా రంగానికి పాఠశాలల మనుగడకు తీవ్ర హాని చేసే నిర్ణయం అని తక్షణమే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకొని అన్ని గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలలు ఉండే విధంగా, అవి సమర్థవంతంగా నిర్వహించే దానికి ప్రభుత్వము చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. విద్యాశాఖలో నెల నెలా ప్రమోషన్లు ఇచ్చే విధంగా ఆదేశాలు ఉన్నాయని కానీ సంవత్సర కాలంగా ఈ ఉత్తర్వులు అమలు కావడం లేదని వెంటనే ప్రమోషన్లు చేపట్టి అర్హత ఉన్నవారిని పై క్యాడర్ లో నియమించడం జరిగితే పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీరుతుందని వారు సూచించారు. జనవరి 2024 నుండి జూలై 2024 వరకు వేల మంది ఉపాధ్యాయులు ఉద్యోగ విరమణ చేశారని ప్రస్తుతం అనేక ఉన్నత పాఠశాలలు ఇద్దరూ లేక ముగ్గురు ఉపాధ్యాయులతో కొనసాగుతున్నాయని, విద్యార్థులకు న్యాయం జరగాలంటే వెంటనే ప్రమోషన్లు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.

ఘనంగా చౌడేశ్వరి జయంతి మహోత్సవం

విశాలాంధ్ర- ఏలూరు : జిల్లాలో దేవాంగ కులస్థులు శ్రీశ్రీశ్రీ చౌడేశ్వరి అమ్మవారి జయంతి మహొత్సవాన్ని ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. సృష్టి ఆరంభంలో దేవతలు, మానవులు, రాక్షసులు తమ మానములు కాపాడుకొనుటకు వస్త్రములు కావాలని పరమశివుడిని వేడుకొగా వస్త్ర నిర్మాణం చేయడానికి శ్రీ దేవల మహర్షి (దేవలుడు) శివుడు ఆజ్ఞతో జన్మించి వస్త్ర నిర్మాణ భాద్యతలు తీసుకున్నారని బ్రహ్మాండ పురాణం చెప్తుందని దేవాంగుల విశ్వాసం. లోక కల్యాణర్థం తలపెట్టిన వస్త్ర నిర్మాణంలో మహర్షి దేవలుడు వస్త్రాలు నేయకుండా పంచరాక్షసులు అడ్డుతగులుతూ చంపడానికి ప్రయత్నించగా జగజ్జనని శ్రీశ్రీశ్రీ చోడేశ్వరి అమ్మవారు రాక్షసులను సంహరించి దేవల మహర్షిని కాపాడుటకు జరిగిందని పురాణాలు చెప్తున్నాయి. దేవాంగ కులానికి మూల పురుషులు దేవాలమహర్షిని పంచరాక్షసుల నుంచి రక్షించడానికి ఆషాడ అమావాస్య రోజున శ్రీశ్రీశ్రీ చౌడేశ్వరి మాత జన్మించినది కనుక ఆషాడ అమావాస్య రోజును దేవాంగ కులస్థులు పవిత్రదినంగా భావించి అమ్మవారి జయంతి ఉత్సవాలు, పూజ క్రతువులు నిర్వహిస్తారని జిల్లా గ్రామ పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాధ్ అన్నారు. చేనేత వర్గానికి చెందిన దేవంగులు సమాజహిత కార్యక్రమాలలో ముందుంటారని అన్నారు.

నర్సాపురంలో శాకాహార ర్యాలీ

విశాలాంధ్ర, నరసాపురం: ప్రపంచ శాంతికి శాకాహారకు ఏకైక మార్గం అని సీనియర్ పిరమిడ్ మాస్టర్ తాడికుటి కృష్ణవేణి అన్నారు. ఆదివారం ఉదయం పట్టణంలోని కృష్ణబాబు కాలనీలో మెగా శాకాహారర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మనుషుల ఆహారం శాకాహారం మాత్రకునని చెప్పారు. మాంస్తా- హారం పలురోగాలకు కారణం అని అన్నారు. బ్రహర్షి సుభాష్- సత్రజీ చూపిన ధ్యాన మార్గంలో అందరూ నడవాలన్నారు. కరినా వంటి మరొక పెనుభూతం రాకుండా ఉండాలంటేటే ప్రజలందరూ శాకాహారులు కావాలన్నారు. మరొక పిరమిడ్ మాస్టర్ వి.వి. భారతి మాట్లాడుతూ శాకాహారం వల్ల ఎలాంటి రోగాలు రావని చెప్పారు. "ఆకుకూరలు తింటే ఈంతా నీ రాజ్యమనాయి.. బెండకాయలు తింటే బుద్ధిమంతులు అవుతారు... దొండకాయలు అంటీ దొరబాబుల్లా ఉంటారు" అంటూ ఆమె రచించిన పాటను గానం చేసి పలువురిని ఆకట్టుకున్నారు. మరొక పిరమిట్ మాస్టర్ ఎన్. భాస్కరరావు మాట్లాడుతూ జీవహింస మహా పాప - మని చెప్పారు. ఏజీవిని చంపే హక్కు మనకు కేదన్నారు. అనంతరం స్థానిక జగన్నాధస్వామి గుడి వద్ద, పాతబాంక్ సెంటు మానవహారం నిర్వహించారు. శాకాహార నినానాదాలు చేసారు. ఇంటింటికి కరపత్రాలు పంచారు. ఈ కార్యక్రమంలో ఈ దుర్గాప్రసాద్, లక్కు శ్రీనివాస్, శ్రీనివాస్, దుర్గారావు, కొక్కిరీగు జగన్నాధరావు, తోట అనంతలక్ష్మి, కొపనాతి శశికళ, గంగ, సరోజు, తిరుమాని నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు .

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

విశాలాంధ్ర-చల్లపల్లి : పర్యా వరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని స్వచ్ఛ చల్లపల్లి రథసారధులు డాక్టర్ డిఆర్ కె.ప్రసాద్, డాక్టర్ పద్మావతి, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి సూచిం చారు. స్వచ్ఛ చల్లపల్లి 3194వ రోజు కార్యక్రమంలో భాగంగా ఆదివారం తెల్లవారుజామున హైవేకు ఇరువైపులా మొక్కలు నాటారు. హైవేపైనా, వంతెనల వద్ద పేరుకున్న మట్టి, పచ్చగడ్డిని తొలగించి శుభ్రపరిచారు. స్వచ్ఛ కార్యకర్తలతో కలిసి వైద్య దంపతులు, సర్పంచ్లు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మన కోసం మనం ట్రస్టు ఎనిమిదేళ్లుగా ప్రతి నెలా విరాళం అందిస్తున్న విశ్రాంత ఉపాధ్యాయుడు ప్రాతూరి ఉదయ శంకర శాస్త్రి ఈనెల విరాళం రూ.5వేలు డీఆర్కేకు అందచేశారు. చల్లపల్లికి ఏమాత్రం సంబంధంలేని శాస్త్రి గ్రామ దత్త పుత్రుడిగా మారి స్వచ్ఛ సేవలందిస్తూ తమవంతు ఆర్థిక సహకారం అందించటం పట్ల స్వచ్ఛ కార్యకర్తలు కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక నిమ్మలతోటలోని సీయోను వృద్ధాశ్రమంలో ప్రాతూరి శాస్త్రి అన్నదానం చేశారు.

తమ్మిలేరుపై హైలెవెల్ కాజ్వే నిర్మించండి...!
తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

విశాలాంధ్ర - చింతలపూడి : సారధి గారు సరిహద్దు ప్రాంతంలో తమ్మిలేరుపై చిన్నంపేట శివపురం గ్రామాల మధ్య హై లెవెల్ కాజ్వే నిర్మించాలని తెలంగాణ సీనియర్ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంత్రి సారధిని కోరారు. ఆదివారం రాత్రి చింతలపూడి మండలం శివపురం గ్రామంలో ఇటీవల మరణించిన గుత్తా సత్యనారాయణ(సత్యం గారు) నివాసానికి వచ్చి ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అనంతరం శివపురం గ్రామస్తులు ఆయనతో మాట్లాడుతూ. చాట్రాయి మండలం చిన్నంపేట చింతలపూడి మండలం శివపురం గ్రామాల మధ్య తమ్మిలేరు కాజ్వే వద్ద వర్షాకాలంలో పదేపదే గళ్ళు పడుతుందని అందువలన స్కూల్ విద్యార్థులు, కాలేజీ విద్యార్థులు, వ్యవసాయం ,వ్యాపారం అన్ని రంగాల వారికి ప్రతినిత్యం రాకపోకలకు అవసరమవుతుందని ఇటీవల సత్తుపల్లి డిపో నుండి విజయవాడ వెళ్లే ఆర్టీసీ బస్సు సౌకర్యం వలన చాలా మేలు జరుగుతుందని ఆంధ్ర రాజధాని కి వెళ్లడానికి విజయవాడ ఆసుపత్రికి వెళ్లడానికి సత్తుపల్లి బస్సు ఎంతగానో ఉపయోగపడుతుందని ఇటీవల వరదకు కాజ్వే వద్ద ప్రమాధకరంగా మారడంతో బస్సు సౌకర్యం ఆగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. దానిపై స్పందించిన తుమ్మల వెంటనే మంత్రి సారథి కి ఫోన్ చేసి స్థానిక పరిస్థితులను వివరించారు. సరిహద్దు ప్రాంతంలో రాకపోకల కోసం హై లెవెల్ బ్రిడ్జ్ నిర్మించాలని కోరారు. మంత్రి సారథి సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో తెలుగు రైతు జిల్లా అధ్యక్షులు గుత్తా వెంకటేశ్వరరావు మాజీ సర్పంచ్ అచ్చిన నరసింహులు నీటి సంఘం మాజీ అధ్యక్షులు నరుకుళ్ళరవి వెదుళ్ళ వేంకటేశ్వరరావు ,నాగరాజు పలగాని నాగరాజు తదితరులు పాల్గొన్నారు.